క్లుప్తంగా

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం రూ.1.23 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గారావు, పర్యవేక్షకులు పి.శ్యామలరావుల సమక్షంలో హుండీలు తెరిచారు. మొత్తం 68 రోజులకుగాను రూ.1,23,794లు సమకూరిందని ఈఓ బీవీ మాదవరావు తెలిపారు. లెక్కింపులో భక్తులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా అంబులం పూజ

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామంలోని పూర్ణపుష్కలాంబ సమేత హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అంబులం పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి టంకాల పాపినాయుడు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ పూజలో అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రంగస్థల నటుడి మృతికి సంతాపం



శాసపు అప్పల నాయుడు(ఫైల్)

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు శాసపు అప్పలనాయుడు (దిబ్బ అప్పలనాయుడు) బుధవారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఆంజనేయుడు, హరిశ్చంద్రుడు వంటి పాత్రల్లో తనదైన శైలిలో ప్రేక్షకులను మెప్పించారు. ఈయన మృతి పట్ల పద్మశ్రీ యడ్ల గోపాలరావు, శాసపు సత్యనారాయణ, గోకవలస కృష్ణమూర్తి, మీగడ మల్లిఖార్జునరావు, మెట్ట దామోదరరావులతో పాటు పలువురు కళాకారులు తమ సంతాపం తెలిపారు.

పన్ను వసూళ్లు రూ.కోటి

● ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు



బొబ్బిలి: స్థానిక మార్కెట్ యార్డు పరిధిలో రెండు నెలల్లో కోటి రూపాయిల పంట ఉత్పత్తుల సెస్సును రైతులు, వ్యాపారుల నుంచి వసూలు చేసినట్టు బొబ్బిలి గ్రేడ్ వన్ కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్టోబర్‌లో రూ.56 లక్షలు, నవంబర్‌లో రూ.44లక్షలు వసూలు చేసి ఖజానాకు జమ చేశామన్నారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న వంటి పంటల ఉత్పత్తుల నుంచి సెస్సు వసూలు చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2.90కోట్ల వసూలు లక్ష్యంగా నిర్ణయించగా లక్ష్యం పూర్తి చేసేందుకు సిబ్బందితో కలసి వసూళ్లు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 8 ఏఎంసీలుండగా విజయనగరం, బొబ్బిలి మార్కెట్ యార్డులకు డిప్యూటీ డైరెక్టర్ జి.శివ నాగకిరణ్, మిగతా ఆరు ఏఎంసీలకు బి.రవి కిరణ్‌లు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో పన్నుల చెల్లింపులు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

రేగిడి: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు దార్లపూడి రవి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని బుధవారం పరిశీలించారు. పొలంలో ప్రకతి వ్యవసాయంతో సాగు చేస్తున్న వరి పంటలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సిమెంటు కాలువల నిర్మాణం

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో రూ.10లక్షలతో సిమెంటు కాలువల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన ప్రధాన రోడ్డులో సిమెంటు కాలువల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. సిమెంటు కాలువ నిర్మాణ పనులను మండల ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షిస్తున్నారు.

పండ్ల తోటలకు కందకాలు



నాయరాళ్లవలసలో పండ్ల తోటల కందకాలను పరిశీలిస్తున్న ఏపీఓ

రేగిడి: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలకు కందకాలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని నాయరాళ్లవలస, లచ్చన్నవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లో రైతులు పండ్ల తోటలకు ఏర్పాటు చేస్తున్న కందకాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కందకాలు ఏర్పాటు చేసుకోవడం వలన దిగుబడులు పెరగడంతో పాటు మొక్క ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు.

● నైపుణ్య గణన సర్వేకు సిద్ధం కావాలి



గ్రామాల్లో నైపుణ్య గణన చేపట్టేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు నైపుణ్య గణన సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నైపుణ్య గణన ద్వారా నిరుద్యోగ యువతలోని నైపుణ్యాన్ని ప్రభుత్వం గుర్తించి, అవసరమైన నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి అవకాశాలను మెరుగుపర్చుతుందన్నారు. 15 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు గల వారందరికీ సర్వే చేసి, నమోదు చేయాలని సూచించారు. ఈఓఆర్‌డీ భాస్కరరావు, ఏఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి రూరల్

● పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరగాలని సంతకవిటి ఏఓ పైల నవీన్ అన్నారు. మండలంలోని మందరాడ రైతు భరోసా కేంద్రంలో బుధవారం వీఏఏ, పాడీ ప్రొక్యూర్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 18 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొంటున్నామని, రైతులు కోరిన మిల్లుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. – సంతకవిటి



● సైబర్ నేరాలపై అవగాహన



గ్రామాల్లోని ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వంగర ఎస్‌ఐ షేక్ శంకర్ అన్నారు. మండలంలోని రుషింగి, మద్దివలస గ్రామాల్లో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జోలికి ఎవరూ పోరాదని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు చేపట్టిన వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు. – వంగర

రబీకి సాగునీరు అందేనా..!

● రాజాంలో..



రాజాంలో పాగిరి సమీపంలో తోటపల్లి పిల్లకాలువ దుస్థితి

రాజాం మండలంలో తోటపల్లి కాలువ ప్రధాన సాగునీరు వనరు. గడిముడిదాం, కంచరాం, దోసరి, కొత్తవలస, శ్యాంపురం, పాగిరి తదితర ప్రాంతాలకు ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా సాగు నీరు అందాల్సి ఉంది. మొత్తం 4 వేల ఎకరాలు మేర ఆయకట్టుకు ఈ ఏడాది రబీలో సాగునీరు ఇవ్వాలి. ఖరీఫ్‌లో చివరి తడి ఇవ్వలేక ఈ కాలువల పర్యవేక్షణ అధికారులు చేతులెత్తేసారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కాగా ఈ కాలువల్లో చుక్కనీరు కూడా లేని పరిస్థితి ఉంది.

● వంగరలో..



వంగరలో తోటపల్లి కాలువలో అరకొరగా సాగునీరు

వంగర మండలంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా 10వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. ఖరీఫ్‌లో అడపాదడపా సాగునీటిని అందించిన అధికారులు రబీకి మాత్రం సహకరించడంలేదు. దీంతో మద్దివలస, ఎం.సీతారాంపురం, వంగర, శివ్వాం, తలగాం గ్రామాలకు సాగునీటి సరఫరాలో ఆటంకం కలుగుతోందని రైతులు వాపోతున్నారు.

● సంతకవిటిలో ..



సంతకవిటి మండలంలో శేషాద్రిపురం వద్ద పంట పొలాలుకు అందని మడ్డువలస సాగునీరు.

మండలంలో ప్రధానంగా మడ్డువలస ఆయకట్టులో 8 వేల ఎకరాలు మేర ఆయకట్టు ఉంది. శేషాద్రిపురం, అప్పలఅగ్రహారం, మండాకురిటి, జీఎస్‌పురం, సిరిపురం, మిర్తివలస, చింతలపేట, గోవిందపురం, మోదుగులపేట తదితర గ్రామాల్లో 2 వేల ఎకరాలు ఆయకట్టు పంట పొలాలకు ఖరీఫ్‌లో కూడా సాగునీరు రావడంలేదు. రబీకి సంబంధించి సాగునీటి ప్రసక్తేలేదు.

రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి: రాజాం నియోజకవర్గంలో సాగునీటి కాలువలు ఉన్నా రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఇటు ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నకు రబీలో ఈ కాలువలు కనీసం కనికరం చూపించడం లేదు. చుక్క నీరు కూడా కాలువలకు రాని పరిస్థితి ఉండడంతో రబీ సాగు మొత్తం నీటిబుడగల మాదిరిగా సాగుతోంది. ఆరుతడి, అపరాల పంటల మినహా వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది.

- ఖరీఫ్‌తో సరి
- నీరు ఉన్నా కాలువలకు రాని సాగునీరు
- తోటపల్లి, మడ్డువలస కాలువ ఆయకట్టులో రైతులకు నీటి కష్టాలు

● రేగిడిలో...



రేగిడి మండలం చినశిర్లాం వద్ద చుక్కనీరు రాని తోటపల్లి

రేగిడి మండలంలో మడ్డువలస, తోటపల్లి సాగునీటి కాలువలు రైతులకు ఆధారం. మడ్డువలస ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువను ఆనుకొని 17ఎల్ సబ్ చానల్ మజ్జిరాముడుపేట, అప్పాపురం, దేవుదల, లక్ష్మీపురం, గోపెంపేట థైలాండ్ భూములకు సాగునీరందడం లేదు. మడ్డువలస కాలువ ద్వారా ఈ మండలంలో ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. రబీలో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వని పరిస్థితి మండలంలో కనిపిస్తోంది.

రబీ సాగుకు నీరివ్వండి



మడ్డువలస ఆయకట్టు శివారు ప్రాంతంలో మా పంట పొలాలు ఉన్నాయి. రబీకి సాగునీరు రావడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. రబీకి కూడా సాగునీరు ఇస్తే మంచి పంటలు పండించి ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది.

– ముదిలి అప్పలనాయుడు, మడ్డువలస ఆయకట్టు రైతు, మోదుగులపేట

పంట దిగుబడి తగ్గిపోనుంది..



మా గ్రామానికి 16ఎల్ తోటపల్లి కెనాల్ బ్రాంచి కాలువ ద్వారా సాగు నీరు రావాల్సి ఉంది. అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితి ఉంది. ఖరీఫ్‌లో ఇబ్బందులు ఎలాగూ తప్పడం లేదు. రబీకి సాగునీరు అందిస్తే ఆరుతడి పంటలైనా రైతులు పండించుకుంటారు.

– టంకాల అచ్చెన్నాయుడు, వైస్ ఎంపీపీ, రేగిడి మండలం

11 కేవీ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన



సతివాడలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తెర్లాం: ప్రధానమంత్రి కుసుం ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలో 11కేవీ సోలార్ ప్లాంటును నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశాల మేరకు మండలంలోని డి.గదబవలస, సతివాడ, ఆమిటి గ్రామాల్లో బుధవారం ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మండలంలో 11కేవీ సోలార్ ప్లాంటును నిర్మించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. దీని నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని మండలంలోని పలు గ్రామాల్లో పరిశీలన చేశామన్నారు. మండలంలోని సతివాడ, ఆమిటి, డి.గదబవలస గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను పరిశీలన చేశామని, ఇదే విషయాన్ని జేసీ తెలియజేస్తామని, ఆయన మూడు గ్రామాల్లో ఏ స్థలం కేటాయించమని కోరితే దానిని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆర్‌ఐ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సాయి, స్థానిక వీఆర్‌ఓలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

వలసలు నివారించడమే లక్ష్యం

● డ్వామా పీడీ కల్యాణచక్రవర్తి



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

రామభద్రపురం: వలసల నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నామని డ్వామా పీడీ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. మండలంలోని దుప్పలపూడి, తారాపురం, కొట్టక్కి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలు, నిబంధనలు ప్రకారం వేతనదారులకు గిట్టుబాటు వేతనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పని అడిగిన ప్రతీ ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. వ్యవసాయ రంగంలో కొన్ని పనులకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేశామన్నారు. ఎంపీడీఓ రత్నం, ఏపీఓ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య



పెరుమాళి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తవ్వుతున్న బోరుబావి

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న తాగునీటి సమస్య తీరనుంది. పెరుమాళిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే చోట ఉన్నాయి. ఈ కేంద్రాలకు సరైన తాగునీటి వనరులు లేకపోవడంతో గ్రామంలో నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. తాగునీటి సమస్యను ముగ్గురు అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు గతంలో ఎన్నోసార్లు తెలియజేశారు. దీనిపై స్పందించిన సర్పంచ్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న ప్రాంతంలో బుధవారం బోరుబావి తవ్వించారు. దీంతో గతకొన్నేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం అవుతున్నందుకు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

కంచరాం విద్యార్థుల ప్రతిభ

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్టూడెంట్ ఐకాన్ ఆఫ్ విజయనగరం అవార్డుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వీవీ వసంతకుమార్ బుధవారం తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలు కలెక్టరేట్ ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెనుభూతల సౌజన్య, పిల్లా శిరీష, పైల సత్యవతిలకు అవార్డును రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు చేతులు మీదుగా అందుకున్నారని అన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో కనబర్చిన ప్రతిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫిస్టివల్‌లో ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. అవార్డు పొందిన విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు గైడ్ టీచర్ పండూరు వేణుగోపాల్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: మద్యం దుకాణ యజమానులు మద్యం అమ్మకాల్లో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎ.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో నింబధనలకు వ్యతిరేకంగా బెల్టుషాపులు నిర్వహణ జరుగుతుందని, అలాగే అనుమతి ఉన్న దుకాణాల నుంచే జోరుగా మద్యం సరఫరా అవుతుంది. దాంతో ఈ నెల 20 మద్యం కిక్కు...నిబధనలు తుక్కు అనే శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది. ఆ కథనానికి స్పందించిన ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు మండలంలోని మద్యం అమ్మకాల తీరుతో పాటు మద్యం దుకాణాలకు నోటీసులు జారీ చేయాలని, అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు జరిగేలా సూచనలు చేయాలని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌కు ఆదేశించారు. ఎస్‌ఐ మండలంలోని మద్యం దుకాణాలను బుధవారం సందర్శించి నోటీసులు జారీ చేశారు. బెల్టు షాపునకు మద్యం సీసీలు అమ్మితే దుకాణ అనుమతులు రద్దు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్రంథాలయాలు జ్ఞాన స్నేహితులు



రాజాం : విజేతలకు బహుమతులు అందజేత

రాజాం: గ్రంథాలయాలు జ్ఞానాన్ని పంచే స్నేహితులని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. రాజాం శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాలు ముగింపులో బుధవారం ఆయన పాల్గొన్నారు. పుస్తకాలు ప్రతీ ఒక్క పాఠకునితో స్నేహం చేస్తాయని, ప్రపంచ జ్ఞానాన్ని అందిస్తాయని, ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని వెల్లడించారు. అనంతరం జాతీయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వృకృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేసారు. గ్రంథాలయ అధికారి వై.అమర్నాథ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, జయరాం మాస్టారు, రమణమ్మ, బీడీసీ నిర్వాహకులు ఉరిటి జగదీష్, రాము పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

సంతకవిటి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జోల శ్రీదేవి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. చిత్రలేఖనం, రంగవల్లిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సాయిశ్వరి చేతులు మీదుగా బహుమతులను అందజేశారు.

రేగిడిలో..

రేగిడి: గ్రంథాలయాలను ప్రతీ విద్యార్థి వినియోగించుకోవాలని ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ అన్నారు. బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఈశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో..

బాడంగి: విజ్ఞాన సముపార్జన కేంద్రాలుగా గ్రంథాలయాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ సుధాకర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, గురుకుల ప్రిన్సిపాల్ నారాయణరావు, హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, ఎస్‌ఐ తారకేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీపీ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

వంగర: తమ డిమాండ్లు పరిష్కరించాలని 104 సిబ్బంది బుధవారం ఎంపీపీ సురేష్ ముఖర్జీకి వినతిపత్రం అందజేశారు. 104 సేవలను ప్రభుత్వమే ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం 50వేల రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృధా కాకుండా చూడాలని, 2020 తరువాత విధుల్లో చేరిన వారికి జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 డ్రైవర్ కూనిబిల్లి శ్రీనివాసరావు, డీఈఓ డి.ఇందు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిరుద్యోగులను గుర్తించాలి

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 15 నుంచి 59 సంవత్సరాలలోపు వయసు గల వారిలో నైపుణ్యాలను గుర్తించాలని ఎంపీడీఓ లోపింటి త్రినాధ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెన్సస్‌పై శిక్షణ బుధవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అజ్ఞాస్త్రం కషాయం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు అజ్ఞాస్త్రం కషాయం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం రైతులు మొక్కజొన్న పంటలో ఈ అజ్ఞాస్త్రం కషాయం పిచికారీ చేయడం వలన కత్తెర పురుగును నిర్మూలించవచ్చని తెలిపారు. ఐసీఆర్‌పీ పోలినాయుడు, రైతులు పాల్గొన్నారు.

క్యూ స్పైడర్స్‌లో 11 మందికి ఉద్యోగాలు

బొబ్బిలి: పట్టణంలోని రాజా కాలేజీలో చదువుతున్న 11మంది విద్యార్థులు ఆన్‌లైన్ ప్లేస్‌మెంట్స్ ద్వారా క్యూ స్పైడర్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్ర కుమార్ విలేకర్లకు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 6, 17 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా ప్లేస్‌మెంట్స్ స్పెషల్ డ్రైవ్ ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. ఈ డ్రైవ్‌లో 9 మంది డిగ్రీ, మరో ఇద్దరు ఎంసీఏ విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు తెలిపారు.

హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం చేయాలి

రాజాం: మండలంలో అన్ని గ్రామాల్లో హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండలంలో బొద్దాం గ్రామంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలించారు. వివరాలు సేకరించి, మాట్లాడారు. ఈ సర్వే పక్కాగా ఉండాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు.

అపరాల సాగులో మెలకువలు పాటించాలి

బొబ్బిలి రూరల్: వరి పంట అనంతరం పొలాల్లో పండించే అపరాల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యాంసుందర్ సూచించారు. మండలంలోని అలజంగి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కదశలో 6సార్లు మందులను పిచికారీ చేయాల్సి ఉంటుందని, తద్వారా తెగుళ్ల నుంచి మొక్కుకు రక్షణ కల్పించి అధిక దిగుబడి సాధించగలమని అన్నారు.అనంతరం రైతుల భూముల్లోని మట్టి నమూనాల ఫలితాల ధృవపత్రాలను రైతులకు అందజేశారు.

మందుల వినియోగంపై అవగాహన

బొబ్బిలి రూరల్: శరీరంలోని ప్రతీ సమస్యకు విచక్షణరహితంగా టాబ్లెట్ల వినియోగంతో శరీరానికి హాని చేస్తున్నామని, వైద్యుల సలహాతోనే మందులను వినియోగించాలని భాస్కరా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కొణతాల రాజేష్ సూచించారు. మండలంలోని కోమటిపల్లి జెడ్పీ పాఠశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించారు. కళాశాల చైర్మన్ భాస్కరరావు, కరస్పాండెంట్ కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనదారుల లక్ష్యాలను చేరుకోవాలి

బాడంగి: వేతనదారులు లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మంజూరైన పల్లెపండుగ పనులను త్వరితగతిన గ్రౌండింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జీ, టెక్నికల్ సహాయకులు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్ నిర్మాణం

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీ సర్పంచ్ కరణం నిర్మల తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో పంచాయతీ అభివృద్ధి విభాగం ద్వారా పనులు చేస్తున్నామని వెల్లడించారు. ఈ డ్రైనేజీ నిర్మాణంతో గ్రామంలో మురుగు సమస్య తీరుతుందన్నారు.

విద్యార్థులకు అపార్ కష్టాలు

సంతకవిటి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి విద్యార్థులు బుధవారం పోటెత్తారు. అపార్ నమోదుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో విద్యార్థులు పెద్దమొత్తంలో లేట్ బర్త్ సర్టిఫికెట్ కోసం నమోదు చేసుకున్నారు.

7 కిలోల కర్రపెండలం



7 కిలోల కర్ర పెండలాన్ని చూపుతున్న వీఏఏ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి రైతు సేవా కేంద్రంలో పండిస్తున్న కర్రపెండలం శాఖలు పెరిగి సుమారు 7 కిలోల బరువుతో ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంత పెద్ద కర్రపెండలం ఇంతవరకు తమ గ్రామంలో చూడలేదని రైతులు తెలిపారు. గత నెలలో ఇక్కడ కర్రపెండలం వేశామని, పెద్ద సంఖ్యలో శాఖలు పెరుగుతూ దాదాపు 7 కిలోల బరువు తూగిందని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంటు పెంట లత తెలిపారు.